క్లుప్తంగా

మెజీషియన్ దేవేంద్రకు సత్కారం



జ్ఞాపిక, సత్కారం అందుకుంటున్న దేవేంద్ర

ఉంగుటూరు: నెల్లూరులో ఇటీవల నిర్వహించిన మేజిక్ ఫెస్టివల్‌లో మండలంలోని రావులపర్రుకు చెందిన అన్నెపు దేవేంద్ర తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీత, మ్యాజిక్ స్టార్ బోస్, నేషనల్ మెజీషియన్ అలీ, టైగర్ మహ్మద్, ఏకే రాయల్ చేతులమీదుగా సత్కారం అందుకున్నారు. వివరాలను సోమవారం దేవేంద్ర స్థానిక విలేకరులకు తెలిపారు.

అన్నసమారాధన



భక్తులకు వడ్డిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం

భీమడోలు: మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పోలసానిపల్లిలో వేంచేసియున్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు తరలివచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేనా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. పూజారి ఉండి భాస్కరరావు, మాజీ ఉప సర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, పెద్దలు కోట శంకర్, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపు నిరోధానికి తనిఖీలు



తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్ రాజు

పెదపాడు : కోళ్ల వ్యర్థాల తరలింపును నిరోధించేందుకు పెదపాడు మండలంలో తనిఖీలు చేపడుతున్నట్లు తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు తెలిపారు. మండలంలోని తోటగూడెం గ్రామం వద్ద రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు రెవెన్యూ, మత్స్యశాఖాధికారులతో కలిసి పహారా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్ల వ్యర్థాల తరలింపును నిరోధించాలనే సంకల్పంతో అన్ని గ్రామాల్లో తనిఖీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ గణేష్, వీఆర్వో మురళీ, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారు చేయాలి



గుడిపాడులో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జునరావు

పెదపాడు : గ్రామాల్లో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు సూచించారు. సోమవారం పెదపాడు మండలంలోని గుడిపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా చేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. అనంతరం వర్మీ కంపోస్టు అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులను పంచాయతీకి జమచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఎస్ సూర్యకుమార్, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటసాల ప్రభాకరరావు పాల్గొన్నారు.

బడుగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ టీవీఎస్‌బీ రాజు పేర్కొన్నారు. జగనన్న బడుగు వికాసం పథకం కింద లబ్ధిదారుకు మంజూరు చేసిన ఆర్టీసీ నాన్ ఏసీ స్లీపర్ బస్‌ను సోమవారం స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండులో ఆయన ప్రారంభించారు. అర్హత ఉన్నా అవకాశాలు లేక ఎంతో మంది పేదలు వెనకబడిపోతున్నారని, అటువంటి వారికి చేయూత ఇచ్చే ఉద్దేశంతో సీఎం జగన్ ప్రవేశ పెట్టిన జగనన్న బడుగు వికాసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాజు తెలిపారు. ఈ పథకం కింద తమ బ్యాంక్ ద్వారా లబ్ధిదారు అర్జా రమాదేవికి రూ.40 లక్షల రుణం మంజూరు చేశామని, దీనిలో దాదాపు 45 శాతం సబ్సిడీగా లభిస్తుందని అన్నారు. ఇటువంటి పథకంతో లబ్ధిదారుల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని, ముఖ్యమంత్రి ఆశయానికి తమ బ్యాంక్ ఆలంబనగా నిలుస్తుందని వివరించారు. ఎస్‌బీఐ ఎస్‌ఎంఈ బ్రాంచ్ మేనేజర్ కె.లక్ష్మణ్, ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు వై.సురేష్ బాబు, వై.నరేష్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గృహసారథులు.. ప్రజా వారధులు కావాలి

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- బువ్వనపల్లిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ



బువ్వనపల్లిలో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ప్రజల మధ్య వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు.. వారధులుగా నిలవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం బువ్వనపల్లిలో తన క్యాంపు కార్యాలయంలో క్రొవ్విడి, బావాయిపాలెం, చానమిల్లి, సిద్ధాపురం, బువ్వనపల్లి, అడవికొలను, ఎనికేపల్లి గ్రామాల్లో పరిధిలోని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని పాలన సాగిస్తున్నారన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా అన్యాయం జరగకూడదనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. గృహసారథులు ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి లబ్ధి పొందని వారిని గుర్తించి వారికి ప్రభుత్వం అందించే పథకాల వివరాలు తెలిపి వారితో దరఖాస్తు చేయించి లబ్ధి చేకూర్చాలన్నారు.

భవిష్యత్‌లో పార్టీలో గుర్తింపు

గృహసారథులు అందించే సేవలకు భవిష్యత్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని, పార్టీ విస్తృతస్థాయి సమావేశాలకు ఆహ్వానం ఉంటుందన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు భవిష్యత్‌లో పార్టీ అంతర్గత సమావేశాల్లో కీలకం కానున్నారన్నారు. గ్రామ వలంటీర్లకు సమాంతరంగా పార్టీ తరఫున బాధ్యతలను గృహసారథులు, జగనన్న గ్రామ సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలన్నారు. గ్రామ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కోడే కాశి, మండల కన్వీనర్లు సంకు సత్యకుమార్, జగనన్న గ్రామ సచివాలయాల మండల సమన్వయకర్త నౌడు అచ్యుతరామారావు, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, అడవికొలను సొసైటీ అధ్యక్షులు పోశింశెట్టి గణేష్, ఏడు గ్రామాల పార్టీ అధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వ్యాధులపై సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు : మండలంలోని దెందులూరు, మేధినరావుపాలెం, గోపన్నపాలెం గ్రామాల్లో సోమవారం సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై సర్వే నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు రోజా, రాకేష్‌ల పర్యవేక్షణలో ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. ఎంపీహెచ్‌ఈఓ నాగరాజు వైద్యసిబ్బంది సర్వేను పర్యవేక్షించారు.

వ్యసనాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



సదస్సులో మాట్లాడుతున్న లోక్ అదాలత్ జిల్లా జడ్జి జి.రాజేశ్వరి

భీమడోలు: చెడువ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా లోక్ అదాలత్ జడ్జి జి.రాజేశ్వరి అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. పిల్లలపై జరిగే నేరాలు, లైంగిక వేధింపులు, మత్తు పదార్థాలపై అవగాహన, మంచి స్పర్శ, చెడు స్పర్శలపై బాలబాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లోక్‌అదాలత్ జడ్జి జి.రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వ్యసనాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 14 లోపు చిన్నారులను తల్లిదండ్రులు విధిగా పాఠశాలల్లో చేర్పించి చదివించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. మండల స్థాయిలో పిల్లలపై నేరాలు, లైంగిక నేరాలపై ప్రత్యేక విచారణ జరుగుతుందన్నారు. ఎవరికైనా ఉచిత న్యాయ సహాయం అవసరమైతే వారి కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షల లోపు ఉండాలని సూచించారు. సీఐ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బారిన పడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నట్లయితే పోలీసులకు ఫిర్యాదుచేయాలన్నారు. ఎస్సై చావా సురేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో బాలబాలికలు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను వివరించారు. వాటిని నిర్మూలనకు మనమంతా ఐక్యతగా పని చేయాలన్నారు. పాఠశాలలో టీచర్లకు ప్రతి సమస్యను తెలియజేయాలన్నారు. యుక్త వయస్సులోనే తోటి స్నేహితుల మాటలకు ఆకర్షితులై తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరింకల విజయరాజు, న్యాయవాదులు అల్లాడ గంగాధరరావు, తోటప్రకాష్, పి.సంపదరావు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 160 మందికి పరీక్షలు



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: మండంలోని వెంకటాపురంలో మానవత ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు వైద్యసేవలు అందించినట్లు మానవత కార్యదర్శి గంజి రవి తెలిపారు. మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి ప్రారంభించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో 160 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 30 మందికి శస్త్రచికిత్సలు అవసరం కాగా, వారిని ఆశ్రం ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అనంతరం పుప్పాల గోపి మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా నిరుపేదలకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం మానవత సంస్థ ధ్యేయం అన్నారు. వైద్యశిబిరాలతో పాటు విద్యకు సంబంధించిన కెరీర్ గైడెన్స్ ఇంకా ఎన్నో సేవలు కార్యక్రమాలు మానవత ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మట్టా మురళీ, ఎంపీటీసీ సభ్యులు పంతుల వెంకన్న బాబు, చిన్నం అనిల్, బి.కొండయ్య, సైదు రాము, బలె రామయ్య వలంటీర్లు పాల్గొన్నారు.

2న గ్రహణ మొర్రి వైద్య శిబిరం

పెదవేగి : సమగ్రశిక్ష, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో మార్చి 2న గ్రహణ మొర్రి, చీలిన పెదవి, అంగిలి (క్లెఫ్ట్ లిప్, పాలెట్) బాధితులకు ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నట్టు ఎంఈవో సీహెచ్ బుద్ధవాస్ సోమవారం తెలిపారు. ఏలూరు అశోక్ నగర్‌లోని అశోకవర్ధని పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, 6 నెలల ఉంచి 50 సంవత్సరాల వయసు గల బాధితులు హాజరుకావచ్చని తెలిపారు. గతంలో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు సైతం శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. పరీక్షల్లో శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి హైదరాబాద్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి అవసరమైన మందులను, రవాణా ఖర్చులు కూడా చెల్లిస్తారని, ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. శిబిరానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమడోలు: పూళ్లలోని కల్లి కొండమ్మ, కల్లి నాగరత్నమ్మ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం 9గంటలకు డాక్టర్ పాండ్రాకుల శ్రీస్వాతి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. వెన్నుముక, నడుము, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న రోగులను రాజమండ్రికి చెందిన వేద స్పైన్ సెంటర్, వెన్నెముక వైద్య నిపుణులు డాక్టర్ పి.తేజోఫణీంద్ర పరీక్షిస్తారన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



జల్లికొమ్మర పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు



సమీకృత వ్యవసాయం నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థిని రత్నప్రభ

గణపవరం : విద్యార్థుల ప్రతిభకు దర్పణంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిలుస్తున్నాయని గ్రామ సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులపాటు జల్లికొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ టీచర్ పి.సౌజన్య ఆధ్వర్యంలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. సోమవారం సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని తరగతి విద్యార్థులు వారి స్థాయిలో 54 సైన్స్ మోడల్స్, వర్కింగ్ మోడల్స్ తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. సమీకృత వ్యవసాయం, వాయు, గాలి కాలుష్యం నివారించడం, బయోగ్యాస్, సోలార్ వినియోగం, భవిష్యత్‌లో జన సాంద్రత పెరిగితే తీసుకోవాల్సిన చర్యలు వంటి ప్రయోగాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం సుందర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే వినూత్నమైన ఆలోచనలతో ఉపాధ్యాయుల సలహాలతో నూతన సాంకేతిక పరిజ్ఞానం తగ్గట్టు ప్రయోగాలు చెయ్యాలని విద్యార్థులకు సూచించారు. ముందుగా విద్యార్థులు, తల్లిదండ్రులు సైన్స్ శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యులు బుద్దాల వెంకటేశ్వరరావు, ప్రసాదరాజు, శ్రీదేవి, పార్వతి, సరస్వతీ, నోబుల్ వాణి తదితరులున్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



లక్కవరంలో మసీదును సందర్శించిన వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని లక్కవరం మసీద్‌ను సోమవారం వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ సందర్శించారు. మసీద్ కమిటీ సభ్యులు, స్థానికులతో ఆయన మాట్లాడి సమస్యలు, మసీద్‌కు వచ్చే ఆదాయ వనరులు అడిగి తెలుసుకున్నారు. మసీద్ ఆస్తుల మీద వచ్చే సంవత్సర ఆదాయానికి సంబంధించి వక్ఫ్‌బోర్డుకు ఫండ్ కట్టి రసీదు తీసుకోవాలని సూచించారు. పాత బకాయిలను వెంటనే చెల్లించాలని, తద్వారా ముస్లింలకు వక్ఫ్‌బోర్డు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మసీద్ కమిటీ సభ్యులకు కామిల్ జమ సూచించారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటున్నారన్నారు. ముస్లింలకు రిజర్వేషన్, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, ఇళ్లస్థలాలు, వసతి దీవెన, వైఎస్సార్ షాదీ తోఫా ప్రవేశపెట్టారన్నారు. పేద ముస్లిం యువతీ, యువకుల వివాహానికి లక్ష రూపాయలను ప్రభుత్వం ఇస్తోందన్నారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు సబ్సిడీ కోట పెంచి హజ్ యాత్రకు పంపుతున్నట్లు వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైన జిల్లాకు చెందిన వక్ఫ్‌బోర్డు భూములను తిరిగి వక్ఫ్‌బోర్డుకు చెందేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వక్ఫ్‌బోర్డు భూములు ఎక్కడా కబ్జాకు గురికాకుండా చర్యలు చేబడుతున్నామన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ షేక్ మొహమ్మద్ జహీర్, పఠాన్ అస్గర్ ఆలీ, షేక్ ఇమామ్, రహమతుల్లా, జనోత్ పాల్గొన్నారు.

బ్యాంకుల సొమ్ము రికవరీ చేయాలి

ఏలూరు (టూటౌన్): డీసీసీబీ బ్యాంకుల అవకతవకలపై వెంటనే ఉన్నతాధికారులతో విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రజల సొమ్మును రికవరీ చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. డీసీసీబీ బ్యాంక్లలో రూ.150 కోట్లు స్వాహా అయినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భారీ బ్యాంక్ గోల్‌మాల్‌పై పత్రికల్లో వస్తున్న వార్తలు ఖాతాదారులను ఆందోళనకు గురిచేస్తున్నట్టు చెప్పారు. అవినీతి ఇలానే కొనసాగితే డీసీసీబీ బ్యాంకు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులతో విచారణ చేయించాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కామవరపుకోట, పెనుగొండ డీసీసీబీ బ్యాంక్‌లలో చేతివాటం చూపించారనే వార్తలు వస్తున్నాయని తెలిపారు. చాగల్లు బ్రాంచ్‌లో నకిలీ బంగారంపై అప్పుల కుంభకోణం జరిగిందన్నారు. పదేళ్ల క్రితం చాగల్లు షుగర్ ఫ్యాక్టరీకి ఇచ్చిన అప్పు రూ.10 కోట్లని, అది వడ్డీతో ఇప్పుడు దాదాపు రూ.30 కోట్లు అయ్యిందని, ఈ మొత్తాన్ని ఎవరు తీరుస్తారని, ఎవరు వసూలు చేస్తారని ప్రశ్నించారు.

దోషులను శిక్షించాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి : మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతిపై న్యాయ విచారణ జరిపించాలని లంబాడీ హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ధారావతు కీమ్యా నాయక్, ఎంపీపీ డా రాంబాబు నాయక్ మాట్లాడుతూ ప్రీతి మృతికి కారణమైన నిందితులకు ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సీనియర్ల ర్యాగింగ్ కారణంగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రీతి మృతి చెందడం బాధాకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల సంక్షేమ సంఘం నాయకులు రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహసారథులతో సమావేశం

ఉంగుటూరు: మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఉంగుటూరులో మంగళవారం ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, పార్టీ సచివాలయ మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ చెప్పారు. ఉంగుటూరులోని స్వర్గీయ పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు పాల్గొంటారని తెలిపారు. బొమ్మిడి, బాదంపూడి, కాగుపాడు, కాకర్లమూడి, నాచుగుంట, నీలాద్రిపురం రావులపర్రు, ఉంగుటూరు, ఉప్పాకపాడు, గ్రామాల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు.

రేపు ఉద్యోగ మేళా

గణపవరం: గణపవరంలోని చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి సోమవారం చెప్పారు. అపోలో ఫార్మసీ, డిగ్రీ కాలేజి జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫార్మాసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులకు ఇంటర్ లేదా డిగ్రీ పాసై 28 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. 2017 నుంచి 2022 సంవత్సరాల మధ్యకాలంలో ఇంటర్, డిగ్రీ పాసై ఉండాలన్నారు. ఆసక్తి కలవారు బుధవారం ఉదయం 9 గంటలకు కళాశాలలో నిర్వహించే ముఖాముఖీ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. రిటైల్ ట్రైనీ అసోసియేట్స్ ఖాళీలు 50, ఫార్మాసిస్ట్ పోస్టులు 10 చొప్పున ఖాళీలు ఉన్నాయని ఆమె తెలిపారు.

నేడు గోపన్నపాలెంలో కంటి వెలుగు

దెందులూరు : గోపన్నపాలెం వైద్యశాలలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. కంటికి సంబంధించి సమస్యలు ఉన్నవారంతా గోపన్నపాలెం పీహెచ్‌సీకి వెళ్లి ఉచిత వైద్యసేవలు పొందాలన్నారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ప్రజలకు సమాచారం అందించినట్లు చెప్పారు.

బ్యాంకులపైనే దేశ ఆర్థిక కార్యకలాపాలు

ఉంగుటూరు: దేశ ఆర్థిక కార్యకలాపాలు బ్యాంకింగ్ రంగంపై ఆధారపడి ఉన్నాయని నారాయణపురం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి అన్నారు. సోమవారం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఆర్థిక కార్యకలాపాలు.. బ్యాంకింగ్ సర్వీసెస్' అనే అంశంపై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అతిథి ఉపన్యాసం ఇచ్చారు. బాబ్జి మాట్లాడుతూ బ్యాంక్‌ల నిర్వహణ తీరు, డిపాజిట్లు, సేవింగ్స్, వడ్డీ రేట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్థికశాస్త్ర విభాగం అధ్యక్షులు నిర్మలా జ్యోతి, కామర్స్ విభాగానికి చెందిన పి.పార్వతి ప్రసంగించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం : యువత మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం, కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ చెడు మార్గాలలో పయనించి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని యువతకు హితవు పలికారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలనే ఉద్దేశంతో పోలీస్, ఎస్ఈబీ అధికారులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాల సమాచారాన్ని ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ ఫోన్ 83329 59175కు, డయల్ 100, జిల్లా వాట్సయాప్ నంబర్ 95503 51100కు మెసేజ్ చేయవచ్చన్నారు. లేదా ఎస్ఈబీ టోల్ ఫ్రీ నెంబర్ 14500కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాల సురేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, శంకరి కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.51 వేల విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మైలవరానికి చెందిన సిరిపురపు కందాల రూపశ్రీ సోమవారం రూ. 51,116 విరాళంగా అందజేశారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

5న ఉచిత మెగా వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మార్చి 5న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంఘ అధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. గుండె, చెవి, ముక్కు, గొంతు, చర్మ, శ్వాస, ఎముకలు, కీళ్లు, కంటి, డయాబెటిక్, బీపీ, గైనిక్ తదితర సమస్యలకు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

4న సాయిబాబా మందిర వార్షికోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శ్రీరామ్ నగర్ 1వ రోడ్డులో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 22వ వార్షికోత్సవం మార్చి 4న నిర్వహించనున్నట్టు మందిర ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం కాకడ హారతి, సాయిబాబా, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు, సౌందర్య లహరి, త్రిశూల పూజ, మధ్యాహ్నం మధ్యాహ్న హారతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. అనంతరం సంధ్యా హారతి, శేజ్ హారతి నిర్వహిస్తామని, కాగా ఉత్సవాల ప్రారంభం సూచికగా మార్చి 3న సాయంత్రం 6 గంటల నుంచి సాయిబాబా వారికి పల్లకి ఉత్సవం ఉంటుందని వివరించారు.

ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి

దెందులూరు : రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని ఏఓ గద్దె రమేష్ కోరారు. సోమవారం దెందులూరు రైతుభరోసా కేంద్రంలో ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 5,186 మందిగాను 4,755 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు మాట్లాడుతూ రైతులు త్వరితగతిన ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు.